# సాక్షి నిజామాబాద్

బుధవారం । 7 । ఆగస్టు । 2024






**శిథిల భవనాలను తొలగించాలి**

శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు.

- 8లో ▸



**బకాయిలు కొండంత..**

అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు 13 నెలల వేతన బకాయిలుండగా రెండు నెలల జీతం మాత్రమే విడుదల చేశారు.

-8లో ▸

గరిష్టం/కనిష్టం

31.9 /23.5

**వాతావరణం**

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడ ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

## న్యూస్‌రీల్

### పార్లమెంట్‌లో సేవాలాల్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి

- ఎంపీ అర్వింద్



**సుభాష్‌నగర్:** పార్లమెంట్ ప్రాంగణంలో గిరిజనుల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి గౌరవించుకోవాలని ఎంపీ అర్వింద్ ధర్మపురి కోరారు. ఈమేరకు పార్లమెంట్ సమావేశాల సందర్భంగా తన ప్రసంగంలో స్పీకర్ ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. బంజారా సమాజంతోపాటు అన్నివర్గాల ప్రజలు సంత్ సేవాలాల్ మహరాజ్‌ను పూజిస్తారని అరివ్వింద్ పేర్కొన్నారు. గిరిజన వర్గాల్లో మూఢనమ్మకాలను నిర్మూలించడానికి, వారి జీవన విధానాన్ని మార్చడానికి తన జీవితం అంకితం చేశారని గుర్తుచేశారు. కర్నాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో సేవాలాల్ మహరాజ్‌ను పూజిస్తారని తెలిపారు.

### తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష



**డిచ్‌పల్లి:** తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని జిల్లా సంక్షేమ అధికారి రసూల్ బీ అన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలన్నారు. మంగళవారం డిచ్‌పల్లిలోని ఎస్ఎల్‌జీ గార్డెన్స్‌లో నిర్వహించిన నిజామాబాద్ డివిజన్ స్థాయి తల్లిపాల వారోత్సవ వేడుకలకు ఆమె హాజరై మాట్లాడారు. శిశువు సంపూర్ణ మానసిక వికాసానికి రెండేళ్ల వయసు వచ్చే వరకు తల్లిపాలు తాగించవచ్చన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు అమృతం లాంటివన్నారు. మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ మాట్లాడుతూ గర్భిణిగా ఉన్నప్పుడు పెరిగిన అదనపు బరువును తల్లిపాలు తగ్గిస్తాయన్నారు. అనంతరం వికసిత్ భారత్, తల్లిపాల ప్రాముఖ్యత తెలిపే క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి యోహాన్, ఎంపీడీవో రవీందర్, సీడీపీవో స్వర్ణలత, ఆరోగ్య పర్యవేక్షురాలు దేవపాల, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

### 'ఓపెన్' ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

**నిజామాబాద్ అర్బన్:** ఓపెన్ స్కూల్ పదో తరగతి, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 8 నుంచి సెప్టెంబర్ 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని, అపరాధ రుసుంతో అక్టోబర్ 3 వరకు దరఖాస్తు చేయొచ్చని వివరించారు. ఉమ్మడి జిల్లాలోని ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లలో ప్రవేశం పొందవచ్చని తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. మరిన్ని వివరాలకు 8008403518 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

### 'స్వచ్ఛదనం' పకడ్బందీగా అమలుచేయాలి


- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



**పెర్కిట్(ఆర్మూర్):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛదనం– పచ్చదనం కార్యక్రమాన్ని క్షేత్రస్థాయిలో పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ఆలూర్ మండల కేంద్రంలో స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాన్ని మంగళవారం ఆయన పరిశీలించి మొక్కలు నాటారు. శిథిలావస్థకు చేరిన ప్రభుత్వ పాఠశాల భవనాన్ని కూల్చివేసి విద్యార్థులకు ఆటస్థలానికి కేటాయించాలని నాయకులు ఆలూర్ శ్రీనివాస్ రెడ్డి, వెల్మ గంగారెడ్డి కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ ప్రతిపాదనను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. పాఠశాలకు చెందిన 14 మంది విద్యార్థులు బాసర ట్రిపుల్ ఐటికి ఎంపిక కావడంపై కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజాగౌడ్, ఎంపీడీవో సాయిరాం, తహసీల్దార్ నరేష్, పీఆర్ డీఈ కిషన్‌నాయక్, ఏఈ నితీష్ పాల్గొన్నారు.

## అక్రమంగా టీఎఫ్‌టీ లైసెన్స్‌లు

- మూడో కల్లుడిపోలో సభ్యత్వం కోసం ఆధార్‌కార్డులో అడ్రస్ మార్ఫింగ్
- నగరంలో నివాసం లేకున్నా గుర్తింపు



**ఖలీల్‌వాడి:** నగరంలోని మూడో కల్లు డిపోలో గీతా కార్మికులకు సభ్యత్వం ఇవ్వడానికి ఏకంగా ఆధార్‌కార్డునే మార్ఫింగ్ చేశారు. ఆధార్ కార్డులో అడ్రస్ మార్చి నగరంలో లేని వారికి లైసెన్స్‌లు అందించారు. నిబంధనల ప్రకారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చి నగరంలో స్థిర నివాసం ఏర్పాటు చేసుకొని టాడి టాపర్స్(టీఎఫ్‌టీ) లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి పరీక్షలు నిర్వహిస్తారు. అయితే నగరంలో స్థిర నివాసం లేకున్నా.. కొందరు ఆధార్‌లో అడ్రస్ మార్ఫింగ్ చేసి లైసెన్స్ పొందారు. నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ యాజమాని ఇంటి అడ్రస్‌పై లైసెన్స్‌లు పొందడం గమనార్హం. మూడో కల్లుడిపోలో భీమ్‌గల్, సిరికొండ, ఇందల్వాయి మండలాలతోపాటు సిరిసిల్ల, నిర్మల్, నల్గొండ జిల్లాలకు చెందినవారు సభ్యత్వం కలిగి ఉన్నారు. గ్రామీణ ప్రాంతం తోపాటు ఇతర జిల్లాలకు చెందిన వారికి కల్లుడిపోలో ఎలా అవకాశం కల్పిస్తారనే ప్రశ్నలు తలెత్తున్నాయి. గ్రామాల్లో లైసెన్స్‌లు పొంది ఇక్కడ సభ్యత్వం తీసుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని గీతాకార్మికులు డిమాండ్ చేస్తున్నారు. దీనిపై నగరానికి చెందిన పలువురు ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్ కమిషనర్ శ్రీధర్, డైరెక్టర్ అజయ్‌రావు, నిజామాబాద్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డిలకు ఫిర్యాదు చేశారు.

**స.హ. చట్టం ద్వారా వెలుగులోకి..**

నగరంలోని మూడో కల్లు డిపోలో స్థానికేతరులు ఉన్నారని స.హ. చట్టం ద్వారా పలువురు గీతాకార్మికులు వివరాలు సేకరించారు. టీఎఫ్‌టీ లైసెన్స్‌లో భీమ్‌గల్ మండలం గోన్‌గోప్పుల గ్రామానికి చెందిన కొత్తూరి సుదర్శన్‌రెడ్డి, కొత్తూరి అమృత్‌గౌడ్, కొత్తూరి మహేందర్‌గౌడ్, సామల స్వామిగౌడ్, శేపూరి ప్రవీణ్‌గౌడ్, ఎస్ నడిపి భోజాగౌడ్, శేపూరి ధర్మగౌడ్, ఎం నర్సాగౌడ్‌కు సభ్యత్వం ఉన్నట్లు అధికారులు స.హ. చట్టంలో దరఖాస్తు చేసుకున్న వారికి తెలిపారు.

**విచారణ జరిపిస్తాం**

నగరంలోని మూడో కల్లుడిపోలో సభ్యత్వం కోసం ఆధార్‌కార్డులో అడ్రస్ మార్చినట్లు ఫిర్యాదులు అందాయి. దీనిపై పూర్తి స్థాయి విచారణ జరిపిస్తాం. ఇతర ప్రాంతాల వారు ఉంటే వారి లైసెన్స్‌లపై కూడా విచారణ చేస్తాం.

– సోమిరెడ్డి, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్, ఉమ్మడి నిజామాబాద్

### ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు

నగరంలోని మూడో కల్లుడిపోలో నిబంధనలకు విరుద్ధంగా స్థానికేతరులకు సభ్యత్వం ఇచ్చారని గౌడ యువజన సంఘం నాయకుడు శ్రీనివాస్‌గౌడ్‌తోపాటు పలువురు మంగళవారం ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. టాపింగ్ టెస్టులో పాల్గొనని వారికి, కల్లు గీత రాని వారికి సభ్యత్వం ఇచ్చారని ఆరోపించారు. స్థానికంగా నివాసం ఉన్న అర్హులైన కార్మికులకు సభ్యత్వం కల్పించాలన్నారు. డిపో అధ్యక్షుడు సెపూర్ స్వామిగౌడ్ తన బంధువులను సభ్యులుగా పెట్టుకున్నారని చెప్పారు. స్థానికేతరులకు లైసెన్సులు ఇచ్చారని, ట్యాపింగ్ టెస్ట్ సమయంలో వీరికి బదులు వేరే వారు పాల్గొన్నారని ఆరోపించారు. ఇతర జిల్లాలకు చెందిన వారికి తాత్కాలికంగా ఆధార్‌కార్డులో అడ్రస్ మార్చి సభ్యత్వం ఇచ్చారన్నారు. అక్రమాలకు పాల్పడిన మూడో డిపో నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎక్సైజ్ డీసీకి వినతి పత్రం అందిస్తున్న మూడో కల్లుడిపో సభ్యులు

## విత్తనాభివృద్ధి సంస్థకు పూర్వవైభవం తెస్తాం



ఆర్మూర్‌లో రైతులతో సమావేశంలో మాట్లాడుతున్న విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

- విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి

**సాక్షి ప్రతినిధి, నిజామాబాద్:** రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థకు పూర్వవైభవం తీసుకొస్తామని ఆ సంస్థ రాష్ట్ర చైర్మన్ సుంకేట అన్వేష్‌రెడ్డి అన్నారు. నిజామాబాద్ సారంగాపూర్‌లోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో మంగళవారం ఆయన తనిఖీలు చేశారు. సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత కొన్నేళ్లలో సంస్థకు సంబంధించిన విత్తనాల అమ్మకం తగ్గిపోవడంపై విచారణ చేశారు. వచ్చే యాసంగి సీజన్ నుంచైనా విత్తనాల అమ్మకం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రైవేట్ సంస్థలు తయారు చేసే విత్తనాల కంటే ప్రభుత్వ సంస్థ తయారు చేసే విత్తనాల అమ్మకం ఎందుకు తక్కువుందో చెప్పాలని అధికారులను ప్రశ్నించారు. సీడ్స్ కార్పొరేషన్ తయారు చేస్తున్న విత్తనాల గురించి అన్నదాతలకు అవగాహన కల్పించాలని సూచించారు. అంతకుముందు విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.

**సంస్థ అభివృద్ధికి సహకరించాలి**

ఆర్మూర్‌లోని విత్తనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అన్వేష్‌రెడ్డి రైతులతో సమావేశమయ్యారు. రైతు సమస్యలను దేశానికి తెలియజేసేందుకు ఆర్మూర్ రైతులతో కలిసి చేసిన పోరాటాన్ని గుర్తుచేసుకున్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా రైతులు, ప్రజల ఆశీర్వాదంతోనే తనకు విత్తనాభివృద్ధి సంస్థ రాష్ట్ర చైర్మన్ పదవి వచ్చిందన్నారు. సంస్థ నుంచి విత్తనాలు కొనుగోలు చేసి అభివృద్ధికి సహకరించాలని రైతులను కోరారు. ఈ సందర్భంగా పలువురు రైతులు సబ్సిడీపై విత్తనాలు అందించాలని కోరారు. కొత్తరకం వంగడాలు అందుబాటులోకి తేవాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసే సమయంలో రైతులు నష్టపోకుండా చూస్తామని ఆయన హామీ ఇచ్చారు. తెలంగాణలో ఏ ప్రాంతంలో ఏ పంటలు పండుతాయో తనకు అవగాహన ఉందన్నారు. వచ్చే యాసంగి సీజన్‌లో కొత్తరకం వంగడాలు రైతులకు అందేలా చర్యలు చేపడుతానన్నారు. ఎర్రజొన్న రైతులకు మేలు జరిగేలా ముఖ్యమంత్రితో మాట్లాడుతానని చెప్పారు. అనంతరం రైతులతో కలిసి మొక్కలు నాటారు. రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ప్రొడక్షన్ మేనేజర్ సంధ్యారాణి, ఇంజినీరింగ్ విభాగం మేనేజర్ ఆర్ నరసింహారెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ ఆదినారాయణరెడ్డి, క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ టి వినయ్, నిజామాబాద్ జిల్లా విత్తనాభివృద్ధి సంస్థ ఆర్ఎం విష్ణువర్ధన్‌రెడ్డి, వేంపల్లి పీఏసీఎస్ చైర్మన్ జక్కా రాజేశ్వర్ పాల్గొన్నారు.

## 20 రోజులు @ 32 టీఎంసీలు

- ఎస్సారెస్పీలోకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

**బాల్కొండ:** శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి 20 రోజుల వ్యవధిలో 32 టీఎంసీల వరద నీరు వచ్చి చేరింది. గత నెల 14 నుంచి ప్రాజెక్ట్‌లోకి ఇన్‌ఫ్లో వస్తోంది. కనిష్టంగా 5510 క్యూసెక్కులతో ప్రారంభమై గరిష్టంగా 56 వేల క్యూసెక్కుల వరకు వరద వచ్చింది. ప్రస్తుతం ప్రాజెక్ట్‌లోకి ఎగువ నుంచి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. మహారాష్ట్ర ప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో ఎగువన ఉన్న బాబ్లీ, బాలేగావ్, అముదుర ప్రాజెక్ట్‌లు నిండుకుండలా మారాయి. దీంతో ఎస్సారెస్పీకి వరద మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్ట్ నుంచి సరస్వతి కాలువ ద్వారా 10 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 550 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కులు నీరు పోతోంది. పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్ట్‌లో 1080.40(45.92 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు.

**నేటి నుంచి నీటి విడుదల**

శ్రీరాంసాగర్ ఆయకట్టుకు బుధవారం నుంచి నీటి విడుదల చేపడుతామని ప్రాజెక్ట్ ఈఈ చక్రపాణి తెలిపారు. కాకతీయ, సరస్వతి, లక్ష్మి కాలువల ద్వారా నీటి విడుదల ప్రారంభిస్తామని పేర్కొన్నారు.

## జయశంకర్ ఆశయాలు సాధించాలి



జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు



అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్, బీజేపీ కార్పొరేటర్లు

- ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, ధన్‌పాల్

**సుభాష్‌నగర్:** తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగాలని, అదే ఆయనకు మనం అందించే నిజమైన నివాళి అని బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అన్నారు. జయశంకర్ జయంతిని పురస్కరించుకుని నగరంలోని కంఠేశ్వర్ చౌరస్తా వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యేలు, కలెక్టర్, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ జయశంకర్ అందించిన సేవలను కొనియాడారు. తెలంగాణ భావజాలాన్ని ముందుకు తీసుకెళ్లిన మహనీయుడని ప్రశంసించారు. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించి ప్రజల్లో ఉద్యమస్ఫూర్తి రగిలించిన గొప్ప వ్యక్తి ప్రొఫెసర్ జయశంకర్ అన్నారు. నీళ్లు, నిధులు, నియామకాలు నినాదంతో ప్రత్యేక రాష్ట్రం కోసం పోరాటం కొనసాగించారని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ప్రజలను చైతన్యపరుస్తూ అహర్నిశం శ్రమించారని గుర్తు చేశారు. ఆయన సేవలను స్మరించుకునేలా ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలు నిర్వహిస్తోందన్నారు. మేయర్ దండు నీతూకిరణ్, కార్పొరేషన్ చైర్మన్ తాహెర్‌బీన్ హందాన్, ఎన్‌డీసీసీబీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మకరంద్, ట్రెయినీ కలెక్టర్ సంకేత్, అదనపు డీసీపీ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

## పక్కాగా బడుల శుభ్రత!

- స్కావెంజర్ల నియామకానికి ఆమోదం
- విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు విడుదల
- అమ్మ ఆదర్శ కమిటీలకు బాధ్యతలు



**నిజామాబాద్ అర్బన్:** ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం మెరుగుపడనుంది. ఎట్టకేలకు బడుల్లో స్కావెంజర్ల నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. విద్యార్థుల సంఖ్యను బట్టి ఆయా పాఠశాలలకు నిధులు మంజూరు చేస్తూ జీవో విడుదల చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో పరిసరాల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణకు కార్మికులు అందుబాటులోకి రానున్నారు. గత కొనేళ్లుగా పాఠశాలల్లో సానిటేషన్ కార్మికులు లేక ఇబ్బందులు ఎదురయ్యాయి. ఉపాధ్యాయ సంఘాల నాయకులు స్కావెంజర్ల నియామకానికి ప్రభుత్వం చొరవ చూపాలని పలుమార్లు వినతులు అందించారు. ఎట్టకేలకు ప్రభుత్వం రెండు రోజుల క్రితం ప్రభుత్వ పాఠశాలల్లో స్కావెంజర్ల నియామకానికి ఆమోదం తెలుపుతూ జీవో విడుదల చేసింది.

జిల్లాలో 1,156 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఇందులో 89,764 మంది విద్యార్థులు చదువుతున్నారు. 1 నుంచి 30 మంది విద్యార్థులున్న పాఠశాలలు 369, 31 నుంచి 100 మంది విద్యార్థులున్నవి 466 ఉన్నాయి. 101 నుంచి 250 మంది విద్యార్థులన్న బడులు 235, 251 నుంచి 500 మంది గలవి 52 ఉన్నాయి. 501 నుంచి 750 మంది ఉన్నవి ఐదు, 750కి పైగా విద్యార్థులున్న పాఠశాలలు రెండు ఉన్నాయి. వీటికి ప్రభుత్వం విద్యార్థుల సంఖ్యను బట్టి నిధులను విడుదల చేయనుంది. స్కావెంజర్ల నియామక బాధ్యతను అమ్మ ఆదర్శ కమిటీలకు అప్పగించింది. ముఖ్యంగా తరగతి గదులు, మూత్రశాలలు, పరిసరాలు శుభ్రపరచడం లాంటి పనులు స్కావెంజర్లు చేస్తారు.

**విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధుల వివరాలు**

| విద్యార్థుల సంఖ్య | నిధులు |
| --- | --- |
| 1 నుంచి 30 | రూ.3000 |
| 31 నుంచి 100 | రూ.6000 |
| 101 నుంచి 250 | రూ.8000 |
| 251 నుంచి 500 | రూ.12,000 |
| 501 నుంచి 750 | రూ.15,000 |
| 750కి పైగా | రూ.20,000 |

**సంతోషంగా ఉంది**



కొనేళ్లుగా పాఠశాలల్లో స్కావెంజర్స్ లేక ఇబ్బందులు పడ్డాం. ప్రస్తుతం వారి నియామకానికి ప్రభుత్వం ఆమోదం తెలపడంతో సంతోషంగా ఉంది. పాఠశాల ఆవరణలు పరిశుభ్రంగా మారనున్నాయి.

– వెంకటేశ్వర్లు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

## సహాయ పరికరాల గుర్తింపు శిబిరం

- నేడు జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ న్యూహౌసింగ్ బోర్డు కాలనీలో..
- 18 ఏళ్ల లోపు దివ్యాంగులు అర్హులు
- సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో నిర్వహణ
- పరీక్షలు నిర్వహించనున్న అలిమ్‌కో ప్రతినిధులు



**ఆర్మూర్:** జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లల (దివ్యాంగులకు)కు సహాయ పరికరాల గుర్తింపు శిబిరాన్ని తెలంగాణ సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు డీఈవో దుర్గాప్రసాద్, సహిత విద్యా విభాగం జిల్లా ఇన్‌చార్జి కోఆర్డినేటర్ శ్రీనివాస్‌రావు పర్యవేక్షణలో నిజామాబాద్ నగరంలోని కంఠేశ్వర్ న్యూహౌసింగ్ బోర్డు కాలనీ (కేసీఆర్ కాలనీ)లో గల న్యూ ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఈ శిబిరం జరుగుతుంది.

**అందజేసే పరికరాలు..**

శారీరక వైకల్యం, మానసిక వైకల్యం, వినికిడి లోపం, అంధత్వంతో బాధపడుతున్న పిల్లలకు అవసరమైన వీల్ చైర్స్, చంక కర్రలు, ట్రై సైకిళ్లు, రొలేటర్స్, హియరింగ్ ఎయిడ్స్, బ్రెయిలీ కిట్, బ్రెయిలీ ప్లేట్స్, బ్రెయిలీ కిట్, ఎమ్మార్ కిట్‌లతో పాటు కృత్రిమ అవయవాలు అందించడమే లక్ష్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారు.

ఆర్టిఫీషియల్ లింబ్స్ మాన్యుఫ్యాక్చరింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (అలిమ్‌కో) సహకారం అందిస్తోంది.

**తీసుకురావాల్సిన ధ్రువీకరణలు**

ప్రత్యేక అవసరాలు గల 0 –18 వయసులోపు పిల్లలు శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. ఇన్‌కం సర్టిఫికెట్, సదరం సర్టిఫికెట్, యూడీఐడీ కార్డు, తెల్ల రేషన్ కార్డు, ఆధార్ కార్డు జిరాక్స్‌లతో పాటు మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో శిబిరానికి హాజరు కావాల్సి ఉంటుంది. సదరం సర్టిఫికెట్ లేని పక్షంలో సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యునిచే ధ్రువీకరించిన పత్రంపై ఎంఈవో లేదా ప్రధానోపాధ్యాయుడి అటెస్టేషన్ చేయించుకొని తీసుకొని రావాల్సి ఉంటుంది. అలిమ్‌కో ప్రతినిధులు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి పరికరాలను సిఫార్సు చేస్తారు. ఈ పరికరాలను 60 శాతం కేంద్ర ప్రభుత్వ నిధులు, 40 శాతం సహిత విద్యా విభాగం నిధులు వెచ్చించి పరికరాలను సమకూర్చుకొని ఎంపిక చేసిన పిల్లలకు అందజేస్తారు. అదేవిధంగా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు రాయితీపై అందజేసే బస్ పాస్‌ను శిబిరంలో అందజేయడానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శిబిరానికి వచ్చే పిల్లలకు ట్రావెలింగ్ అలవెన్స్ (టీఏ) అందజేస్తారు.

**గుర్తించబడిన పిల్లలు**

జిల్లా వ్యాప్తంగా 2,057 మంది ప్రత్యేక అవసరాలు గల పిల్లలలో సుమారు 500 మంది చిన్నారులకు వివిధ కేటగిరీల్లో పరికరాలు అవసరం ఉన్నట్లు సహిత విద్యావిభాగం పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ (ఐఈఆర్పీ)లు గుర్తించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. వీరిని శిబిరానికి తరలించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

**సద్వినియోగం చేసుకోవాలి**



ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి. వివిధ వైకల్యాలతో బాధపడుతున్న పిల్లలకు సహాయ పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయి.

– దుర్గాప్రసాద్, డీఈవో, నిజామాబాద్

**ఉచితంగా పరికరాల అందజేత**



దివ్యాంగులకు అలిమ్‌కో ప్రతినిధులు అవసరమైన పరికరాల గుర్తింపు పరీక్షలు నిర్వహిస్తారు. గుర్తించిన వారికి పరికరాలను త్వరలో ఉచితంగా అందజేస్తాం. పరికరాల అందజేత సమాచారాన్ని అర్హులకు తెలియజేస్తాం.

– శ్రీనివాస్‌రావు, సహిత విద్యావిభాగం జిల్లా ఇన్‌చార్జి కోఆర్డినేటర్

## క్లుప్తంగా

### వ్యవసాయ శాఖలో ఏవోల బదిలీలు

డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లా వ్యవసాయ శాఖలో అగ్రికల్చర్ ఆఫీసర్ల బదిలీలు జరిగాయి. హైదరాబాద్ నుంచి రాష్ట్ర శాఖ అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌లో మంగళవారం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. జిల్లా కార్యాలయంలో టెక్నికల్ విభాగంలో పని చేస్తున్న సుధామాధురి డిచ్‌పల్లికి, శ్రీకర్ బాసరకు, అర్బన్ ఏడీ కార్యాలయంలో పని చేస్తున్న సౌమ్య మోపాల్‌కు బదిలీ అయ్యారు. అదే విధంగా బాల్కొండ పని చేస్తున్న మహేందర్ అర్బన్ కార్యాలయానికి, రాంబాబు డిచ్‌పల్లి నుంచి ఆలూర్, సురేశ్‌గౌడ్ నవీపేట్ నుంచి డీఏవో కార్యాలయానికి, లావణ్య మోర్తాడ్ నుంచి బాల్కొండకు, వెంకటేశ్ సిరికొండ నుంచి ధర్పల్లికి, అబ్దుల్ మాలిక్ కమ్మర్‌పల్లి నుంచి మహబూబాబాద్‌కు, రాజ్‌కుమార్ ముప్కాల్ నుంచి ఇబ్రహీంపట్నంకు బదిలీ అయ్యారు. అదే విధంగా కామారెడ్డి జిల్లా నుంచి నిజామాబాద్ జిల్లాకు నలుగురు ఏవోలు బదిలీపై వస్తున్నారు. బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు త్వరలో రానున్నట్లు జిల్లా వ్యవసాయాధికారి వాజిద్ హుస్సేన్ తెలిపారు.

### హెచ్‌సీఏ అండర్-19 జట్టుకు ఎంపిక



నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న హేమలత హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అండర్-19 ప్రాబబుల్స్ జట్టుకు ఎంపికైనట్లు కోచ్ బాగారెడ్డి మంగళవారం తెలిపారు. ఇటీవల ఉప్పల్ స్టేడియంలో సెలక్షన్స్ నిర్వహించగా, హేమలత బౌలింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పేర్కొన్నారు. అర్సపల్లికి చెందిన హేమలత తండ్రి సాయిలు వ్యవసాయం చేస్తుండగా, ఆమె నగరంలో కోచ్ బాగారెడ్డి వద్ద ప్రత్యేకంగా శిక్షణ తీసుకుంటున్నది.

### ఏఏవో వ్యవహారంపై సీఎండీ సీరియస్

- చర్యలు తీసుకోవాలని ఆదేశాలు

సాక్షి ఎఫెక్ట్..

నిజామాబాద్‌నాగారం: నిజామాబాద్ రూరల్ ఈఆర్‌వో ఏఏవో విజయ్‌కుమార్ వ్యవహారంపై టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి సీరియస్‌గా స్పందించారు. 'హెచ్ఆర్ఏ వద్దు.. హెడ్ క్వార్టర్స్‌లో ఉండను' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో కథనం ప్రచురితం కావడంతో సీఎండీ ఆరా తీశారు. ఏఏవో విజయ్‌కుమార్ హెడ్‌క్వార్టర్స్‌లో ఎందుకు ఉండడం లేదని, సంబంధిత డీఈ ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారంలోగా పూర్తిస్థాయి నివేదికను తెప్పించుకోవాలని ఎస్ఈ రవీందర్‌రెడ్డిని ఆదేశించినట్లు తెలిసింది.

# బకాయిలు కొండంత.. మంజూరు గోరంత

- అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలకు 13నెలల వేతన బకాయిలు
- ఎట్టకేలకు రెండు నెలల వేతనం విడుదల



మోర్తాడ్(బాల్కొండ): జిల్లాలోని వివిధ పీహెచ్‌సీలు, సబ్ సెంటర్‌లలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఏఎన్ఎంలకు వేతన బకాయిలు భారీగా పేరుకుపోగా, కేవలం రెండు నెలల వేతనాన్ని చెల్లించి చేతులు దులుపుకున్నారు. జిల్లా, రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపంతో ఏడాది కాలానికి పైగా అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు వెట్టి చాకిరీ చేస్తూనే ఉన్నారు. 2021 సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేయగా 2023 జూన్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో 56 మంది ఏఎన్ఎంలను నియమించారు. వాస్తవానికి 67 పోస్టులకు ఇంటర్వ్యూలను నిర్వహించారు. కొంత మంది తమకు మరో ఉద్యోగం రావడం, ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరడంతో 56 మంది పోస్టింగ్ తీసుకున్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయి అధికారుల మధ్య సరైన అవగాహన లేకపోవడంతో అవుట్ సోర్సింగ్ విధానంలో నియమించిన ఏఎన్ఎంలకు వేతనాల గ్రాంట్‌ను విడుదల చేయలేదు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల కోడ్ కారణంగా వేతనాల గ్రాంట్ విడుదల చేయడానికి సాంకేతిక సమస్య అడ్డు వచ్చింది. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఏఎన్ఎంలు తమ వేతనాల కోసం పోరాటం చేస్తూనే ఉన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన తరువాత సైతం ఏఎన్ఎంలు తమ వేతనాల గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. 2023 జూన్‌లో నియమితులైన ఏఎన్ఎంల కాంట్రాక్ట్‌ను పొడగించినా వేతనాలు చెల్లించడానికి బడ్జెట్ లేకపోయింది. వైద్యారోగ్య శాఖ కమిషనర్ క్రిస్టినా చోంగ్తూను ఉద్యోగులు కలిసి తమ గోడు వెళ్లబోసుకోగా.. ఆమె ఆర్థిక శాఖ ఆమోదం తీసుకుని నిధుల మంజూరుకు కృషి చేశారు. అయితే, 13 నెలల వేతనాలకుగాను కేవలం 2 నెలల వేతనాలే జమ చేశారు. మరి కొద్దిరోజుల్లో నిధులు విడుదల చేసిన తరువాత పూర్తి స్థాయిలో వేతనం చెల్లిస్తామని ఉన్నతాధికారులు వెల్లడించారని, వేతనాలు రాకపోవడంతో ఇంటి అద్దె, కుటుంబ పోషణ, పిల్లల చదువుల కోసం పుస్తెలను సైతం తాకట్టుపెట్టుకోవాల్సి వచ్చిందని అవుట్ సోర్సింగ్ ఏఎన్ఎంలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వీలైనంత తొందరగా పూర్తి స్థాయిలో వేతనాలను చెల్లించాలని కోరుతున్నారు.

# నాణ్యతకు భరోసా భారతి సిమెంట్

- డీలర్ల సమావేశంలో సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఎంసీ మల్లారెడ్డి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న మల్లారెడ్డి, కొండల్‌రెడ్డి, ఓబుల్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు తదితరులు

నిజామాబాద్‌నాగారం: నాణ్యతకు భరోసాగా భారతి సిమెంట్ ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆ సంస్థ మార్కెటింగ్ ఉపాధ్యక్షుడు ఎంసీ మల్లారెడ్డి అన్నారు. నిజామాబాద్ నగరంలోని వంశీ కాన్ఫరెన్స్‌హాల్‌లో భారతి సిమెంట్ డీలర్ల సమావేశాన్ని మంగళవారం నిర్వహించగా, మల్లారెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతి సిమెంట్ ఉత్పత్తి ప్రారంభించిననాటి నుంచి వినియోగదారుల నమ్మకాన్ని చూరగొంటోందన్నారు. జర్మన్ టెక్నాలజీ, రోబోటిక్ ల్యాబొరేటరీ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో సిమెంట్ ఉత్పత్తి చేస్తున్నామని, మార్కెట్‌లో భారతి సిమెంట్‌కు విశేషమైన ఆదరణ లభిస్తోందన్నారు. తాపీమేస్త్రీలకు సంస్థ ద్వారా వ్యక్తి గత ప్రమాదబీమా పథకాన్ని అమలు చేస్తూ వారిని ఆదుకుంటున్నామని వివరించారు. అనంతరం ఎల్ఈడీ స్క్రీన్ ద్వారా భారతి సిమెంట్ కంపెనీలో సిమెంట్ ఉత్పత్తి, ప్యాకింగ్, లోడింగ్ తదితర అంశాలపై డీలర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ సహ ఉపాధ్యక్షుడు టి.కొండల్‌రెడ్డి, డీజీఎం(టెక్నికల్ సర్వీసెస్) సి.ఓబుల్‌రెడ్డి, మార్కెటింగ్ మేనేజర్ వి.నాగేశ్వర్‌రావు, టెక్నికల్ సర్వీసెస్ మేనేజర్ కె.సునీల్, సిబ్బంది పాల్గొన్నారు.

# మధ్యాహ్న భోజనం తినలేం..

- గ్రామస్తులు, అధికారులకు విద్యార్థుల లేఖ
- ఏజెన్సీ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని వేడుకోలు


మధ్యాహ్న భోజనంలో పురుగులు

మాచారెడ్డి: మండలంలోని ఘన్‌పూర్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు వస్తున్నా పట్టించుకునే నాథుడే లేడని ఏకంగా విద్యార్థులే గ్రామస్తులకు రాసిన లేఖ మంగళవారం కలకలం సృష్టించింది. గత కొద్దిరోజులుగా మధ్యాహ్న భోజనం, అంబలిలో పురుగులు వస్తున్నా పట్టించుకోవడం లేదని విద్యార్థులు లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్ఎంకు ఎన్నిసార్లు చెప్పినా దాట వేస్తు వచ్చారని ఆందోళన వ్యక్తం చేస్తూ లేఖను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్‌తో పాటు గ్రామస్తులకు రాశారు. ఏజెన్సీ నిర్వాహకులను మార్చాలని తాము ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని, పప్పు తక్కువ వేసి నీళ్లచారునే వడ్డిస్తున్నారని విద్యార్థులు లేఖలో పేర్కొన్నారు. తల్లిదండ్రుల సమావేశంలో తాము మధ్యాహ్న భోజనం అధ్వానంగా ఉందని చెప్పగా, హెచ్ఎం బెదిరించి తిట్టారని పేర్కొన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని డీఈవో, ఎంఈవోలకు మొరపెట్టుకున్నారు.

# పోలీసుల అదుపులో బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్

- ల్యాండ్ చీటింగ్ కేసులో హైదరాబాద్ పోలీసుల విచారణ
- కిడ్నాప్ అంటూ తప్పుడు ప్రచారం


సాయినాథ్‌ను వెంట తీసుకెళ్తున్న హైదరాబాద్ పోలీసులు

బాన్సువాడ : మండలంలోని బుడ్మిలో బ్రాంచ్ పోస్ట్ మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సాయినాథ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారంటూ మంగళవారం తప్పుడు ప్రచారం జరిగింది. అయితే, చీటింగ్ కేసులో సాయినాథ్‌ను హైదరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. బాన్సువాడ పట్టణంలోని టీచర్స్ కాలనీలో నివాసముంటున్న సాయినాథ్ ఇంటికి ఉదయం ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వచ్చారు. సాయినాథ్ ఉన్నాడా? అంటూ ఆయన భార్యను అడగగా ఉన్నాడని ఆమె తన భర్తను పిలిచింది. మీతో మాట్లాడాలని సదరు ఇద్దరు వ్యక్తులు సాయినాథ్‌ను వెంట తీసుకెళ్లారు. వారి వెనకాలే సాయినాథ్ భార్య రామవ్వ కూడా కొంతదూరం వెళ్లి చూసింది. టీచర్స్ కాలనీ రోడ్డుపై కొంత దూరం వెళ్లగానే సాయినాథ్‌ను సదరు వ్యక్తులు కారులో ఎక్కించుకుని తీసుకెళ్లడంతో ఆమె తన భర్తను ఎవరో కిడ్నాప్ చేశారని పోలీసులకు సమాచారం అందించింది. టీచర్స్ కాలనీలో ఉన్న సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించారు. ల్యాండ్‌చీటింగ్ కేసులో హైదరాబాద్ పోలీసులు సాయినాథ్‌ను విచారణ నిమిత్తం తీసుకెళ్లారని సీఐ కృష్ణ నిర్ధారించారు. ఇదే కేసులో బాన్సువాడ మండలం పోచారం తండాకు చెందిన ఓ వ్యక్తిని కూడా అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ కిడ్నాప్ అయినట్లు సోషల్‌మీడియాలో వైరల్ కావడం కలకలం రేపింది.

### మాక్లూర్‌లో కేటీఆర్ తనయుడు



మాక్లూర్: మండల కేంద్రానికి మాజీ మంత్రి కేటీఆర్ కుమారుడు హిమాన్షు మంగళవారం వచ్చారు. బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ సెల్ నాయకుడు బిగాల మహేశ్‌గుప్తా కుమారుడు అద్విత్‌తో కలిసి మాక్లూర్‌కు వచ్చిన హిమాన్షు.. బిగాల సోదరులు సొంత నిధులతో నిర్మించిన విఠలేశ్వర ఆలయంతోపాటు రామాలయాన్ని సందర్శించి స్వామివార్లను దర్శించుకున్నారు. అనంతరం బిగాల సోదరులు రూ.కోటి విరాళం అందజేసిన ప్రభుత్వ పాఠశాలను సందర్శించారు. పుట్టిన ఊరికి బిగాల సోదరులు ఈ స్థాయిలో సేవలందించడం గొప్ప విషయమని హిమాన్షు పేర్కొన్నారు. వారివెంట రామాలయం చైర్మన్ సాయికుమార్, సభ్యులు తిరుమల్ నర్సాగౌడ్, పాఠశాల ఉపాధ్యాయులు ఎం లక్ష్మీనారాయణ, రచ్చ మురళి, గ్రామస్తులు ఉన్నారు.

# ఎంఈడీ పరీక్షలు ప్రారంభం

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో ఎంఈడీ నాల్గో సెమిస్టర్ రెగ్యులర్, 2, 3, 4వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలు మంగళవారం ప్రారంభమైనట్లు అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షకు 37 మంది విద్యార్థులకు గాను 37 మంది హాజరైనట్లు తెలిపారు.

**పీజీ ఇంటిగ్రేటెడ్ బ్యాక్‌లాగ్ పరీక్షలు..**

యూనివర్సిటీ పరిధిలో కొనసాగుతున్న పీజీ ఇంటిగ్రేటెడ్ కోర్సెస్ బ్యాక్‌లాగ్ 1, 3, 4, 7, 9వ సెమిస్టర్ పరీక్షలు మంగళవారం ప్రశాంతంగా జరిగినట్లు ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. తెయూ మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్ (భిక్కనూర్), ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ (కామారెడ్డి), ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్) పరీక్షా కేంద్రాల్లో ఉదయం నిర్వహించిన పరీక్షలకు 151 మంది విద్యార్థులకు గాను 128 మంది హాజరు కాగా 23 మంది గైర్హాజరయ్యారన్నారు.

**పీజీ నాల్గో సెమిస్టర్ పరీక్షలు..**

యూనివర్సిటీ పరిధిలో పీజీ నాల్గో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. వర్సిటీ మెయిన్ క్యాంపస్‌లోని పరీక్షా కేంద్రాన్ని రిజిస్ట్రార్ ఎం.యాదగిరి, కంట్రోలర్ ఎం.అరుణ, అడిషనల్ కంట్రోలర్ సాయిలు, వైస్‌ప్రిన్సిపాల్ సత్యనారాయణ తనిఖీ చేశారు. తెయూ మెయిన్ క్యాంపస్, సౌత్ క్యాంపస్ (భిక్కనూర్), గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కాలేజ్ (నిజామాబాద్), ఆర్ట్స్ అండ్ సైన్స్ డిగ్రీ కాలేజ్ (కామారెడ్డి), ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (బాన్సువాడ), ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ (ఆర్మూర్) లలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు కొనసాగుతున్నట్లు కంట్రోలర్ తెలిపారు. పరీక్షలకు 1,674 మంది విద్యార్థులకు గాను 1,600 మంది హాజరు కాగా 74మంది గైర్హాజరైనట్లు అకడమిక్ ఆడిట్‌సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

# రూ. 4.50 కోట్లు అప్పు ఇచ్చేందుకు రూ.69 లక్షలు వసూలు

- మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫైనాన్షియర్‌పై కేసు నమోదు!
- బాధితుడికి తిరిగి రూ.35 లక్షలు చెల్లింపు
- నాలుగు రోజుల్లో మిగతా డబ్బులు చెల్లించేలా ఒప్పందం

ఖలీల్‌వాడి: వ్యాపార అవసరాల కోసం అప్పడిగిన వ్యక్తి నుంచి ఫైనాన్షియర్ ముందుగానే డబ్బులు తీసుకున్న ఘటన నగరంలోని మూడో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఒంగోలు జిల్లాకు చెందిన చేపల చెరువు వ్యాపారికి రూ.4.50 కోట్లు అవసరం పడడంతో తెలిసిన వారి ద్వారా ఓ వడ్డీ వ్యాపారిని సంప్రదించాడు. ఫైనాన్షియర్‌ను రూ.4.50 కోట్లు అప్పు అడగగా.. ముందుగా రూ.69 లక్షలు చెల్లించాలని షరతు పెట్టడంతో సదరు వ్యాపారి ఆ మొత్తాన్ని అందజేశాడు. ఆ తరువాత అప్పు ఇస్తానన్న డబ్బులు ఇవ్వకుండా ఫైనాన్షియర్ ఇబ్బందులకు గురి చేయడంతో చేపల చెరువు వ్యాపారి ఓ పోలీసు ఉన్నతాధికారిని సంప్రదించగా, ఆ అధికారి జిల్లా పోలీస్‌బాస్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై వాకబు చేయాలని పోలీస్‌బాస్ సీఐని ఆదేశించినప్పటికీ ఆయన స్థానంలో మరో పోలీస్ అధికారి ఎంట్రీ ఇచ్చి సదరు వడ్డీ వ్యాపారి నుంచి రూ.35 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రచారం జరుగుతోంది. అయితే, విచారణ చేపట్టిన అధికారి డబ్బులను చేపల చెరువు వ్యాపారికి ఇవ్వకుండా తన వద్దే ఉంచుకున్నట్లు తెలుసుకున్న పోలీస్‌బాస్.. మరో డివిజనల్ స్థాయి అధికారిని రంగంలోకి దించినట్లు సమాచారం. దీంతో పోలీసు అధికారి తాను వసూలు చేసిన డబ్బులను తనపైస్థాయి అధికారితోపాటు వడ్డీ వ్యాపారి సమక్షంలో మొదటగా రూ.25 లక్షలు, మరోసారి రూ.10 లక్షలు చెల్లించినట్లు తెలిసింది. మిగతా డబ్బులను నాలుగు రోజుల్లో చేపల చెరువు వ్యాపారికి తిరిగి చెల్లిస్తానని ఫైనాన్షియర్ ఒప్పుకున్నట్లు సమాచారం. అయితే సదరు వడ్డీ వ్యాపారిపై మూడో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైనట్లు తెలిసింది.

### శిథిలావస్థలో ఉన్న భవనాలను తొలగించాలి



వర్ని: శిథిలావస్థకు చేరిన భవనాలను, ఖాళీ ప్రదేశాల్లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని అదనపు కలెక్టర్ అంకిత్ మండల అధికారులను ఆదేశించారు. మంగళవారం వర్ని మండల కేంద్రంలోని సత్యనారాయణపురంలో ఆయన పర్యటించి మురికి కాలువలు, నిజాంసాగర్ ఉపకాల్వలను, పాతన భవనాలను, రోడ్డు పక్కన నడుపుతున్న తినుబండారాల దుకాణాలను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, గ్రామంలో అపరిశుభ్రత లేకుండా చూడాలని పంచాయతీ అధికారులకు సూచించారు. గ్రామాల్లో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తే పంచాయతీ కార్యదర్శులను బాధ్యులుగా చేస్తూ శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయనవెంట తహసీల్దార్ సాయిలు, ఎంపీడీవో వెంకటేశ్ తదితరులు ఉన్నారు.





## క్రైం కార్నర్

### ఉద్యోగం పోయిందని ఆత్మహత్యాయత్నం



ఎల్లారెడ్డి: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన మాలి ఉద్యోగం చేసిన చిన్న సాయిలు అనే వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. కొద్ది సంవత్సరాలుగా చిన్న సాయిలు ఆస్పత్రిలో మాలి ఉద్యోగం చేస్తున్నాడు. అయితే, రెగ్యులర్ ఉద్యోగి రావడంతో తన ఉద్యోగం పోయిందని మనస్తాపంతో సోమవారం రాత్రి ఎలుకల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. సాయిలుకు ఉద్యోగం కల్పించి తమను ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

### సీసీ కెమెరాలు ధ్వంసం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని గోపాల్‌పేటలో లక్షల రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. రెండేళ్ల క్రితం నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో పలువురు వ్యాపారుల సహకారంతో సుమారు 15 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. గత కొన్నిరోజులుగా సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో సాంకేతిక సమస్య కావొచ్చని పోలీసులు భావించి టెక్నీషియన్‌కు సమాచారం అందించారు. సోమవారం టెక్నీషియన్ పరిశీలించగా.. గ్రామంలో ఒకటి రెండు మినహా మిగతా సీసీ కెమెరాలు ధ్వంసమయ్యాయని గుర్తించి పోలీసులకు తెలిపాడు. గ్రామంలో చోరీలు చేసేందుకు దుండగులు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారా? లేక రాత్రివేళ ఇసుక అక్రమ రవాణాకు పాల్పడేవారు చేశారా? అనేది తేలాల్సి ఉంది.

### వృద్ధుడి అదృశ్యం

మోపాల్(నిజామాబాద్‌రూరల్): మండలంలోని న్యాల్‌కల్‌కు చెందిన ముత్యంరావు అనే వృద్ధుడు అదృశ్యమైనట్లు ఎస్సై గంగాధర్ మంగళవారం తెలిపారు. ఈనెల 3వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన ముత్యంరావు తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు పలు చోట్ల వెతికారన్నారు. ఆచూకీ లభించకపోవడంతో ముత్యంరావు భార్య రజిత ఫిర్యాదు చేసిందని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

### మిర్చి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం బోల్తా

కమ్మర్‌పల్లి: మిర్చి లోడ్‌తో వెళ్తున్న డీసీఎం వ్యాన్ మండల కేంద్రంలో మంగళవారం ఉదయం బోల్తాపడింది. మహారాష్ట్రలోని బోకర్దాన్ నుంచి ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణానికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఉప్లూర్ క్రాస్ రోడ్డువద్ద ఆటోను తప్పించే క్రమంలో ఓ షాపు ముందు రేకుల షెడ్డును ఢీకొని డీసీఎం బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్ రామారావుకు గాయాలుకాగా, ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. బోల్తా పడిన వ్యాన్‌ను జేసీబీతో రోడ్డుపై నుంచి తొలగించారు.

# కత్తెరతో పొడిచి అన్న హత్య

- బాన్సువాడ పట్టణంలో ఘటన


కృష్ణ (ఫైల్)

బాన్సువాడ : క్షణికావేశంలో తమ్ముడు తన అన్నను కత్తెరతో పొడిచి హత్య చేశాడు. సోమవారం రాత్రి బాన్సువాడలో చోటుచేసుకున్న ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని దాల్‌మల్‌గుట్టకు చెందిన వకీల్‌గారి గంగామణికి ముగ్గురు కుమారులు కాగా, పక్కపక్కనే వేర్వేరు ఇళ్లలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు కృష్ణ తన భార్యతో మనస్పర్ధల కారణంగా తల్లితో కలిసి ఉంటుండగా, అతడి భార్య భార్య మంజుల ఇద్దరు పిల్లలతో కలిసి తాడ్కోల్ శివారులోని డబుల్ బెడ్ రూం కాలనీలో ఉంటోంది. మేస్త్రీ పని చేసే కృష్ణ పని ముగించుకుని సోమవారం రాత్రి ఇంటికి వచ్చాడు. కాళ్లు కడుక్కునేందుకు గచ్చులోకి వెళ్లి అక్కడ చీకటి ఉండడంతో లైట్ వేయాలని తమ్ముడు రాజుకు చెప్పాడు. తన భార్యతో కలిసి భోజనం చేస్తున్న రాజు.. అన్నం తిన్న తరువాత వేస్తానని సమాధానమిచ్చాడు. అప్పటికే మద్యం మత్తులో ఉన్న కృష్ణ.. రాజు ఇంటి తలుపులను నెడుతూ గొడవకు దిగడంతో అతడు తన తల్లికి ఫోన్‌లో విషయం తెలుపగా ఆమె ఇంటికి చేరుకుంది. ఆ తరువాత ఇద్దరు గొడపవపడ్డారు. ఒకరినొకరు నెట్టుకుంటున్న క్రమంలో రాజు కుట్టు మిషన్‌పై ఉన్న కత్తెరను తీసుకొని కృష్ణ చేయి, మెడపై పొడిచాడు. తల్లి గంగామణి కాలనీ వాసులను పిలిచి కృష్ణను ఆస్పత్రికి తరలించినప్పటికీ అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. తన పెద్ద కుమారుడు కృష్ణ మృతికి కారణమైన చిన్న కుమారుడు రాజుపై చర్యలు తీసుకోవాలని తల్లి గంగామణి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రమాదవశాత్తు బావిలోపడి మృతి

జక్రాన్‌పల్లి: మండలంలోని నల్లగుట్ట తండాకు చెందిన మూడ్ దినేశ్ అనే వ్యక్తి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలోపడి మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. నల్లగుట్ట తండాకు చెందిన దినేశ్ చిన్ననాటి నుంచి అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. అయితే ఈ నెల 5న సాయంత్రం 6 గంటలకు ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయాడు. మంగళవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో గ్రామ శివారులోని వ్యవసాయ బావిలో దినేశ్ మృతదేహం కనిపించింది. ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరుగుతున్న సమయంలో బావి వద్దకు వెళ్లి ప్రమాదశాత్తు నీటి బావిలోపడి ఈత రాక దినేశ్ మృతి చెందాడని ఎస్సై తెలిపారు. మృతుడి అన్న మూడ్ గణేశ్ ఫిర్యాదు మేరు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**చికిత్సపొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు..**

ఖలీల్‌వాడి: గుర్తు తెలియని వృద్ధుడు జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఎల్లమ్మగుట్ట ప్రాంతంలో తిరుగుతున్న సుమారు 65 ఏళ్ల గుర్తు తెలియని వృద్ధుడు అనారోగ్యానికి గురికావడంతో స్థానికులు పోలీసులకు సోమవారం సమాచారం అందించారు. బాధితుడిని జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

# పేకాట స్థావరాలపై దాడి

బోధన్‌రూరల్: మండలంలోని అమ్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై మంగళవారం సాయంత్రం పోలీసులు దాడి చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురిని అరెస్ట్ చేశామని, పట్టుబడిన వారి నుంచి రూ.4,840 నగదు స్వాధీనం చేసుకున్నామని రూరల్ ఎస్సై నాగనాథ్ తెలిపారు.

**ముల్లంగి శివారులో..**

డిచ్‌పల్లి: మండలంలోని ముల్లంగి శివారులో పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం సిబ్బందితో కలిసి దాడి చేశారు. ముగ్గురు పేకాటరాయుళ్లు పట్టుబడగా, మరో ముగ్గురు పరారయ్యారు. పట్టుబడిన వారి నుంచి రూ.4,800 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ తెలిపారు.

**ఆర్మూర్‌లో..**

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోటార్మూర్, పెర్కిట్ ప్రాంతాల్లో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేశారు. ఎనిమిది మందిని అదుపులోకి తీసుకొని సెల్‌ఫోన్లు, రూ.67,440 నగదు స్వాధీనం చేసుకొని స్థానిక పోలీసులకు అప్పగించారు. దాడిలో టాస్క్‌ఫోర్స్ సీఐ పురుషోత్తం, ఎస్సై అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

### మాయమాటలు చెప్పి వివాహితపై అత్యాచారం

- ఇద్దరిపై కేసు నమోదు

కామారెడ్డి క్రైం: భర్తతో దూరంగా ఉంటున్న ఓ వివాహితకు మాయమాటలు చెప్పి ఆమెపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో వెలుగు చూసింది. వివరాలు ఇలా ఉన్నాయి.. భర్తతో గొడవల కారణంగా తల్లిగారింటి వద్దే ఉంటున్న మహిళకు పరిచయం ఉన్న ఇద్దరు యువకులు మాయమాటలు చెప్పి గత జనవరిలో పలుసార్లు అత్యాచారానికి పాల్పడినట్లు తెలిసింది. గర్భం దాల్చడంతో సదరు మహిళ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసినట్లు సమాచారం.

### మానసిక స్థితి సరిగాలేని వ్యక్తి ఆత్మహత్య

బాన్సువాడ రూరల్: మానసిక స్థితిబాగా లేకపోవడంతో మండలంలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన గొల్ల సాయిలు (70) చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు బాన్సువాడ సీఐ కృష్ణ తెలిపారు. సాయిలు గతంలోనూ పురుగుల మందు సేవించగా కుటుంబసభ్యులు ఆస్పత్రిలో చికిత్స చేయించారు. ఈనెల 5వ తేదీన ఇంటి నుంచి వెళ్లిన గొల్ల సాయిలు తిరిగిరాకపోవడంతో అతడి ఆచూకీ కోసం వెతుకుతుండగా చెరువు గట్టుపై చేతికర్ర, టవల్ కనిపించడంతో జాలర్లసహాయంతో చెరువులో గాలించారు. సాయిలు మృతదేహం లభించడంతో పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

### ఇసుక ట్రాక్టర్ పట్టివేత

సిరికొండ: మండలంలోని తాళ్లరామడుగు గ్రామ పరిధిలోని కప్పలవాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు ఎస్‌హెచ్‌వో బాల్‌సింగ్ మంగళవారం తెలిపారు. తమను చూసి డ్రైవర్ ట్రాక్టర్‌ను వదిలేసి పారిపోయాడని, ట్రాక్టర్‌ను పిట్ల లింబాద్రికి చెందినదిగా గుర్తించామన్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

### పాఠశాలలో చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న శంకర్ భవన్ స్కూల్‌లో చోరీ జరిగినట్లు హెచ్ఎం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. సోమవారం రాత్రి చోరీకి పాల్పడిన దుండగులు రెండు ట్యాబ్‌లను ఎత్తుకెళ్లారని ఫిర్యాదులు పేర్కొన్నట్లు సమాచారం. గతంలోనూ చోరీలు జరిగినా పోలీసులు పట్టించుకోలేదనే విమర్శలు ఉన్నాయి.